# పగవాడికి వద్దు రెండో కొడుకు బాధ

ఇస్కూలు ఇంటర్‌బెల్లులో ఖాసిం బండికాడ రేగుపొళ్లు కొనుక్కుంటా ఉంటే కేతిరెడ్డి శ్రీదరుగాడు ఉన్నవాడు ఉండకుండా పుల్లటి మాట ఒకటి చెప్పినాడు.

'మావా. ఏందో ధూప్ ఛావ్ అంటా. ఎండన ఒకలాగా నీడన ఒకలాగా మెరస్తా ఉంటుందంట షర్టు. మా నాయన తెచ్చిచ్చినాడు. మా టైలరు కూడా బలే కుట్టినాడు ప్రెస్ బటన్లు పెట్టి. రేపు బేస్తవారం మనకి యూనీఫారమ్ ఉండదుగదరా. ఆ రోజు ఏసుకొని వస్తాను బడికి. నా లెక్క ప్రకారం అదిరిపోద్ది మావా' అన్నాడు ఉప్పులో రేగుపొళ్లు అద్దుకొని నోట్లో ఏసుకుంటా.

దానికి నా పక్కన ఉన్న కాండూరి మురళీగాడు ఊరుకోకుండా 'శ్రీదరా. అదేం పెద్ద గొప్పకాదురా. మా బామ్మకి ఇప్పటి దాకా నన్ను నెహ్రూ లాల్చీలో చూసుకోలేదని చాలా యిదిగా ఉందంట. నిన్ననే పొన్నూరు సిల్కు రెండు మీటర్లు తీసి కుట్టడానికి యిచ్చింది. మా యింట్లో చెట్టు లేదుగనక ఎనకింటి శీనయ్య వాళ్లింట్లో గులాబి పువ్వుకి కూడా ఆర్డరు పెట్టింది. రేపు బేస్తవారం ఆ లాల్చీ తొడుక్కుని, గుండీకి రోజా పువ్వు పెట్టుకొని వస్తాను. నా లెక్కప్రకారం నీ దూప్‌చావ్ నా పక్కన నిలవడం కష్టం మావా. ఆకరు నిష్టూరం కన్నా ఆది నిష్టూరం మేలని ముందే చెప్పేస్తా ఉన్నాను' అన్నాడు రేగుపొండుని గింజతో పాటు లోపలికి మింగేస్తా.

దానికి కందుల మాలకొండరావుగాడు తగులుకొని 'ఒరే ఒరే ఆపండిరా మీ మాటలు. ధూప్‌ఛావ్‌లతో, కాలరు లాల్చీలతో పని జరగదురా. మొన్నెవరో కొత్తింట్లో చేరతా మా నాయనకి ప్యాంటూ చొక్కా పెట్టినారు. మా నాయన పంచె తప్ప ప్యాంట్లు తొడగడు గనక ఆ ప్యాంటుగుడ్డ వృదాపోవడం దేనికని పైనా కిందా కలిపి నాకు బుస్‌కోటుగా కుట్టిస్తా ఉన్నాడు. రేపు బేస్తవారం ఆ మ్యాచింగు డ్రస్సులో నేను గనక దిగితే మీరిద్దరూ ఔటురా' అన్నాడు వాళ్లిద్దరి పొగరు మీద కాలు పెట్టి తొక్కతా.

ఈ మాటలన్నీ వింటా ఉంటే నాకు సరసరా సరసరా అంటా ఉంది లోపల. యింకా బతికుండటం దేనికి పొయ్యి ఏ మిలటరీలోనైనా చేరిపోతే పోదా అని కూడా అనిపించింది.



మొకంలో నీళ్లు దిగిపోతా ఉంటే దూరంగా పొయ్యి కానుగచెట్టు కింద కూచున్నాను. చేతిలో రేగుపొళ్లు ఉన్నాయిగాని లోపలికి పోవడంలా. ఏడుపుఏడుపుగా ఉంటే కాళ్ల సందన మొకం పెట్టుకొని కూచున్నాను.


అది చూసి వాళ్లు 'ఏందిరా... కదీరా.. అట్టయిపోయినావు ఏందిరా' అన్నారు నా చుట్టూ చేరతా.

నేను పలక్క పోయేసరికి 'ఒరే.. చెప్పరా. మేము నీ ఫ్రెండ్సు గదరా. మాకు చెప్పరా' అన్నారు మళ్లీ.

నేను తలకాయ పైకెత్తి 'మీకు చెప్పినా అర్థం కాదులేరా. ఇదంతా ఆ పైనున్నోడు కచ్చ పెట్టుకొని నా నుదుటిన రాసిన రాత. అసలకి మనిషనేవాడు ఎవ్వడూ ఏ ఇంట్లో కూడా రెండోకొడుగ్గా పుట్టకూడదురా. పుడితే అంతేరా. నాకు పట్టిన గతి తప్పదురా. ఇది నాకు తెలిసొచ్చిన సిద్ధాంతంరా' అన్నాను దుక్కంగా.

వాళ్లకి అర్థం కాక 'ఏందిరా నువ్వు చెప్పే మాటలా? అసలికే లెక్కల్లో సిద్ధాంతాలు సైన్సులో సిద్ధాంతాలు అర్థంకాక సస్తా ఉంటే ఈ కొత్త సిద్ధాంతం ఏందిరా? మాకు అర్థమయ్యేలా చెప్పరా?' అన్నారు కూచుంటా.

నేను పొడుగ్గా గాలి పీల్చి 'ఏం చెప్పమంటారురా? మా యింట్లో నలుగురం పిలకాయలం. మా అన్న, నేను, మా చెల్లెలు, మా తమ్ముడు. మా అన్న మొదటి బిడ్డగనక వాడు పుట్టిన కాణ్ణుంచి గారాబమేరా. బూరంటే బూర.. గారంటే గార. బూట్లంటే బూట్లు



సైకిలంటే సైకిలు. వాణ్ణి నెత్తిన పెట్టుకొని దించకుండా పెంచినార్రా మా అమ్మా నాన్నా. ఆనేక నేను పుట్టినాను.. అప్పటికే మా అన్నతో ముద్దు మురిపాలన్నీ మురిగిపోయి స్పీడు తగ్గి ఏలాడబడి ఉంటారుగదరా... యింక నా మీద ఏముంటుంది ప్రేమ? ఆ... పుట్టాడంటే పుట్టాడు అనుకొని మా అన్నవాడిన గుడ్డలు, ఏసుకొన్న చెప్పులు, ఆడుకున్న బొమ్మలు తీసి నా మొకాన కొట్టినారు. సరేలే వాళ్ల చెడ్డతనం వాళ్లకాడ ఉంటుంది మన మంచితనం మన కాడ ఉంటుంది అనుకొని నేను సర్దుకొని పోతా ఉంటే మా చెల్లెలు పుట్టింది'...

'చెల్లెలు పుట్టడం అంటే యింట్లో ఆడపిల్ల పుట్టడం కదా. ఇంక మళ్లీ మా అన్నకు లాగ రాజబోగాలు మొదులు. మొగ్గలంటే మొగ్గలు గుబ్బలంటే గుబ్బలు.. అమ్మా బడవా ఎండాకాలం వొచ్చిందంటే చాలు మూడుమార్లు పూలజడ కుట్టి ఆరుమార్లు జడఫోటోలు తీపిచ్చుడమే పని. మా చెల్లెలు మా యింట్లో మహరాణీ అయిపోయింది. కరెంటు పోతే మా నాయనంతటి మనిషి నిద్రలేచి మా చెల్లెలి పక్కన కూచుని యిసనకర్ర యిసరతా ఉంటాడు. నేను నిద్రకళ్లతో లేచి చూస్తే- చిన్నపిల్లగదరా దోమలు కుడతాయి నీక్కూడా ఊపేదా అని నా మొకాన రెండుసార్లు ఆడిస్తాడు. పుండు మీద కారం దొర్లినట్టుగా నేను పొళ్లు కొరుక్కుంటా ఉంటే ఈ లోపల మా తమ్ముడు పుట్టినాడు'...

'తమ్ముడంటే ఎవడు? ఇంటికి ఆకరువాడు. సంటి పిల్లోడు. రౌండు గిర్రున తిరిగి మళ్లా మొదలైన చోటే ఆగినట్టు ఇంటికి పెద్ద కొడుకు కంటే ఇంటికి ఆకరు కొడుకు మీద బలే ప్రేమ జాస్తిరా అమ్మానాయనలకి. వాణ్ణి సంక దింపితే ఒట్టు. అమ్మ సంకన

రొంతసేపు అయ్య సంకన రొంతసేపు గాల్లో ఏలాడతా కొమ్మల్లో కోతి పెరిగినట్టుగా పెరిగినాడు వాడు. పెరుగన్నం అంటే పెరుగన్నం పాలన్నం అంటే పాలన్నం... ఇప్పుడు అర్ధమైందంటరా నా బాద. మా అన్నకి గారాబం ఉంది మా చెల్లెలికి గారాబం ఉంది మా తమ్ముడికి గారాబం ఉంది. నాకు మాత్రం లేదురా. యియ్యాల మీరంతా అది కుట్టిచ్చుకొని వస్తాను ఇది కుట్టిచ్చుకొని వస్తాను అని అంటా ఉంటే నేను ఏది కుట్టిచ్చుకొని రావాలిరా? మా అన్నకి చిన్నవైన గుడ్డలన్నా తొడుక్కొని రావాల. లాకుంటే ఉన్న యూనిఫారమే తొడుక్కొని రావాలా. కాదు కొత్తయ్యి కొని పెట్టండి అనంటే నాకు ఎవరు కొనిపెడతారురా. అసలికే రెండో కొడుకుని' అన్నాను, కళ్లమ్మట బొటబొటా నీళ్లు రాలుస్తా.

నా సిద్ధాంతానికీ, నేను డీటైలుగా చెప్పిన పద్ధతికి కేతిరెడ్డిగాడు, కాండూరిగాడు, కందులగాడు బాగా కదిలిపోయినారు.

చాలా సేపటిదాకా కూచుని కూచుని 'ఇట్టాంటి ప్రాబ్లము మా యిళ్లల్లో లేదు గదరా' అన్నారు ఆలోచన చేస్తా.

'ఎందుకు ఉంటుందిరా? కేతిరెడ్డిగాడు వాళ్లింట్లో ఒక్కగానొక్క కొడుకు. మురళీగాడు కూడా అంతే. ఇంక కందులుగా. మా తమ్ముడిలాగా నువ్వు మీ యింట్లో లాస్టువాడివి. కోతి నాయాలివి. మీకు ఏముంటాయిరా నాకు లాగా బాదలు' అన్నాను అక్కసుగా.

'కాదురా. నువ్వు చెప్పేది నేను నమ్మనురా. మా యింట్లో జామచెట్టు ఉంది కాబట్టి నాక్కూడా ఒక సిద్ధాంతం తెలుసురా. చెట్టు ఏ కాయని కూడా తనది కాదనుకోదురా. అన్ని కాయలు ఒకటేరా దానికి' అన్నాడు మాలకొండరావుగాడు నాకు సర్దిచెప్పాలని చూస్తా.

'ఒరే.. నువ్వు ముయ్యరా. మా యింట్లో కూడా ఉందిరా జాంచెట్టు. అది కొన్ని కాయలని ఆకులన్నీ కప్పి పండేలా చూసుకుంటుందిరా. కొన్ని కాయలని గాలికి వదిలేసి సస్తే ఏమి బతికితే ఏమి అనుకుంటుందిరా. తాతకి దగ్గులు నేర్పించినట్టుగా నువ్వు నా కాడ మాట్లాడబాకురా' అన్నాను కోపంగా.

అంతటితో కోపం తీరక 'నేను చెప్పేది నిజంరా. ఏ ఇంట్లో అయినా మొదట ఆడపిల్ల పుట్టి మళ్లా ఆడపిల్ల పుట్టి ఆ తర్వాత కొడుకు పుట్టినాడనుకో. యింక ఆ యింట్లో ఆ రెండో కూతురు పరిస్తితి కూడా నాలాంటి పరిస్తితేరా. ఎవ్వరూ పట్టించుకోర్రా. అసలకి తరుడు చైల్డు పుట్టంగానే సెకండు చైల్డుకి ప్రాబ్లము మొదలురా. అందుకే మీరంతా నాకు మాట యియ్యాలిరా. పెద్దయినాక గవర్నమెంటోళ్లలాగా యిద్దరు లేక ముగ్గురు అనకుండా యిద్దరితోనే ఆపాలిరా. అప్పుడు ఇద్దరు మొగపిలకాయలు పుట్టినా ఇద్దరు ఆడపిలకాయలు పుట్టినా ఒక ఆడ ఒక మగ పుట్టినా ఒకరు ఫస్టు ఒకరు లాస్టు గాబట్టి ఇద్దర్నీ గారాబంగా చూసుకుంటారురా. ముగ్గురు నలుగురిని కని రెండో బిడ్డకి అన్యాలం చెయ్యమని నాకు ప్రామిస్ చెయ్యండిరా' అన్నాను చేయి సాపతా.

నా మాటలకి శ్రీదరుగాడు కళ్లు నీళ్లు నీళ్లుగా చేసుకొని 'ఒకేరా. ఉయ్ విల్ గివ్ బర్త్ టు ఓన్లీ టూ చిల్డ్రన్‌రా' అన్నాడు చేతిలో చెయ్యి వేస్తా.

కందులుగాడు, కాండూరిగాడు నా మొకం వంక చూసి పెళ్లయ్యి పెళ్లాలొచ్చినాక ఒక మాట అడిగి ప్రామిస్ చేద్దామా ఇప్పుడే చేద్దామా అనుకుంటా సరే ఎందుకైనా మంచిదని

'అలాగేరా. మేము కూడా ఆ మాట మీదే నిలబడతాముర్రా' అని ప్రామిస్ చేసేసినారు.

'అంతా బాగానే ఉందిగానీ ఇప్పుడీ కొత్త గుడ్డల సంగతి ఏందిరా. నీకు లేకుండా మేము ఏసుకొని వస్తే నువ్వు ఫీలవుతావు గాబట్టి మేము ఏసుకొని రాముర్రా. ఇళ్ల కాడ ఏసుకుంటాములేరా' అన్నాడు శ్రీదరుగాడు.

'అట్టేమీ బళ్లేదురా. నా తెల్ల చొక్కా ఒకటి ఉత్తపుణ్యానికి ఇంకు మరకలు పడి వేస్టు అయిపోయి ఉంది. ఎంకటేశ్వరాహోలుకాడ రంగులేసే ఆయనకాడికి పోయి అడిగితే మూడు రూపాయలు పట్టకరా మెరూన్ కలరులో ముంచి యిస్తా అన్నాడు. ఆ రంగు గనక ఏయిస్తే ఆ తెల్లచొక్కా కొత్త మెరూన్ చొక్కా అయిపోతుందిరా. కాకపోతే మీ ముగ్గురూ మూడు సింగిల్ రూపాయలు అడ్జస్ట్ చెయ్యాలిరా' అన్నాను వాళ్ల వంక చూస్తా.

వాళ్లు మొకామొకాలు చూసుకొని 'తిప్పి తిప్పి మళ్లా మాకే పెట్టినావుగదరా టెండరు' అనుకొని నాకు మూడు రూపాయలు తెచ్చి పెట్టినారు.

మా ఇస్కూల్లో మాకు యూనీఫారమ్ ఉండని బేస్తవారం రోజున నేను కూడా వాళ్లతో సరిసమానంగా గుడ్డలు కట్టుకొని, రెండో కొడుకునన్న లోటు లేకుండా దగదగలాడినాను.

కానీ ఆ రోజు వాళ్ల ముగ్గురి కాడ అట్లా ఏడ్చి చచ్చినానుగానీ రాను రాను ఈ రెండో కొడుకులో ఉన్న సుకం నాకు నెమ్మది నెమ్మదిగా తెలిసొచ్చింది. చదువు పేరు చెప్పి, ఉద్యోగం పేరు చెప్పి మా యింట్లో మొదటగా బయటపడింది నేనే.

పాపం మా అన్న, ఇంటికి పెద్ద కొడుకు అయినందుకు పెద్దపాలేరుతో సమానంగా మా అమ్మనీ నాయన్నీ కావలిలో ఉన్న మా ఇంటినీ కాపెట్టుకొని కాపెట్టుకొని ఇంకా ఇప్పటికీ కాపెట్టుకొనే ఉన్నాడు.

మా యింట్లో మా చెల్లెలు ఒక్కగానొక్క కూతురు అయిన పాపానికి, మా అమ్మకి ఆరోగ్యం బాగలేకపోతే కొత్తగా పయిటలు కట్టే వయసులోనే యింటి పనులు నెత్తికి ఎత్తుకొని సింగిల్ హ్యాండు మీద నెట్టుకొని వస్తా నెట్టుకొని వస్తా ఇప్పుడు పెళ్లయి ఒక యింటికి కోడలు అయినా ఇంకా మా యింటి మీద ఒక కన్నేసి పెట్టి నెట్టుకొని వస్తానే ఉంది.

ఇంక మా తమ్ముడి సంగతి మరీ అన్యాలం. చిన్నకొడుకైనందుకు తుమ్మినా దగ్గినా సూదులకీ మందులకీ ఆస్పత్రులకీ బజార్లలో వస్తవలకీ తిరిగి తిరిగి మా అన్న రోజులకి రోజులు పనుల కోసం ఊర్ల మీద పడి పోతే యింటికి మగదిక్కు అయ్యి అంత చిన్నపిల్లవాడు ఎంతో పెద్దపిల్లవాడిలాగా అవస్తలు పడినాడు.

నేనే– ఏ పనీ చెయ్యక ఏస్కేపు కొట్టింది.

కానీ అంతమాత్రం చేత రెండోకొడుకు బాదల మీద ఇంతకు ముందర మాట్లాడిన మాటలన్నీ కేన్సిలు చేసుకుంటానని అనుకోబాకండి. రెండో కొడుకు బాదలు రెండో కొడుకుయే. అయి ఒకరు ఆర్చేయిగావు ఒకరు తీర్చేయి గావు. ఈ మాటను ఏ కాయితం మీద కావాలంటే ఆ కాయితం మీద రాసిచ్చి ఏ కోరటులో గావాలంటే ఆ కోరటులో ఎంత గట్టిగానైనా మాట్లాడగలను.

ఎందుకంటే ఈ కత చదివిన రెండో కొడుకులంతా నా పక్కనే ఉంటారుగదా అని.

■